క్లుప్తంగా

కాలనీలకు డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని వినతి



జలమండలి మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న భాస్కర్‌యాదవ్

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లో సుమారు 11 కాలనీలకు అంతర్గత డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ కాలనీలకు డ్రైనేజీని నిర్మించాలని కోరుతూ పీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్‌యాదవ్ సోమవారం జలమండలి మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. నాయకుల నిర్లక్ష్యం కారణంగా పలు కాలనీలలో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆయా కాలనీలను అధికారులు సందర్శించి అంతర్గత డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి

- మలక్‌పేట సర్కిల్–6 ఎన్నికల అధికారి జయంత్



చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో ఉన్న 300 పోలింగ్ కేంద్రాలలో ఈనెల 26, 27 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహిస్తామని సర్కిల్–6 ఎన్నికల అధికారి జయంత్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ, ఓటరు లిస్టులో అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 19 వరకు స్వీకరిస్తామన్నారు. వచ్చిన అభ్యంతరాలను సెప్టెంబర్ 28లోగా పరిశీలిస్తామన్నారు.ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అభ్యంతరాలు ఉంటే వాటిని కూడా పరిశీలించేందుకు ఓటర్ల జాబితాను అక్టోబర్ 1న ప్రచురిస్తామన్నారు. ఓటర్ల తుది జాబితాను అక్టోబర్ 4న ప్రకటిస్తామన్నారు. ఇప్పటికే ఓటరు జాబితా సవరణపై బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



మౌనికకు ఆర్థిక సాయం అందజేస్తున్న కాచం సత్యనారాయణ

చైతన్యపురి: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం లభిస్తుందని వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. షాద్‌నగర్‌కు చెందిన వైశ్య కుటుంబానికి చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్ కూతురు మౌనిక ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఫీజు చెల్లింపు కోసం ఆమెకు వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో రూ. 10 వేలును బుధవారం చైతన్యపురిలో అందజేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి వంగునూరి రమేష్‌గుప్తా, తేలుకుంట్ల రాంబాబు గుప్త కాపర్తి ప్రకాష్ గుప్తా పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పహాడీషరీఫ్: పేదల పాలిట సంజీవనిలా సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉందని మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బండారి గోపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మామిడిపల్లికి చెందిన ఈసంపల్లి అంజయ్య భార్య అండాలు అనారోగ్యానికి గురై చికిత్స పొందడంతో కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేయించగా, మంత్రి సబితా ఇంద్రారెడ్డి సిఫార్సు మేరకు రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబ సభ్యులు మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు యాతం బాల్‌రాజ్ యాదవ్, కిరణ్‌కుమార్ ముదిరాజ్, అశోక్ ముదిరాజ్, శంకర్, శ్రీశైలం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు, మహిళలకు అన్యాయం

కాచిగూడ: త్వరలో జరుగనున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సీట్ల కేటాయింపులో బీసీలు, మహిళలకు అన్యాయం జరిగిందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ ఆరోపించారు. బుధవారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలకు, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు 50 శాతం టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ బీసీలకు కేవలం 22 సీట్లను మాత్రమే ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. టికెట్ల కేటాయింపులో అగ్రకులాలలకు పెద్ద పీటను వేశారన్నారు. నేతలు భూషణ్ భాస్కర్, సిహెచ్ ప్రదీప్‌గౌడ్, నల్లెల కిషోర్ గౌడ్, డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, పులిజాల కృష్ణ ధరణీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భౌ భౌలతో భయం..భయం!

- కాలనీల్లో వీధి కుక్కల స్వైరవిహారం
- పాదచారులపై దాడులు
- ఆందోళనకు గురవుతున్న స్థానికులు



అంబేడ్కర్‌నగర్‌లో తిరుగుతున్న కుక్కల గుంపు

దిల్‌సుఖ్‌నగర్: వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సరూర్ నగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సాయంత్రం అయిందంటే చాలు రోడ్లపై తిరుగుతూ పాదచారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఆర్‌కేపురంలోని ఎన్‌టీఆర్‌నగర్, మార్గదర్శికాలనీ, మల్లికార్జుననగర్, సరూర్‌నగర్‌లోని అంబేడ్కర్‌నగర్ తదితర కాలనీలలో కుక్కల బెడదతో చిన్న పిల్లలు సాయంత్రం వేళ ఆరుబయట ఆడుకోవాలంటేనే భయపడుతున్నారు. కుక్కలు రాత్రి సమయాల్లో పెద్దగా అరుస్తూ కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయని కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లోని గ్రామసింహాలను వేరే ప్రాంతాలకు తరలించి వాటి బారినుంచి తమను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

వేరే ప్రాంతాలకు తరలించాలి

ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే వీధి కుక్కలు ఎక్కడి నుంచి వచ్చి దాడి చేస్తాయోనని కాలనీలవాసులు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. వీధికుక్కలను తరలించేలా అధికారులు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలి.

– మహేష్, ఎన్‌టీఆర్‌నగర్

వీధికుక్కలతో భయాందోళన

చీకటి పడిందంటే వీధి కుక్కలతో ఇబ్బందిగా ఉంది. మేము నగరంలోని వేరే ప్రాంతంలో పని చేసి ఇంటికి వచ్చేసరికి రాత్రి అవుతుంది. ఆ సమయంలో కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయోనని భయాందోళనకు గురవుతున్నాం. అధికారులు స్పందించి వెంటనే వీధి కుక్కలను ఇక్కడి నుంచి తరలించాలి.

– యాదయ్య, అంబేడ్కర్‌నగర్

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఉంటాం: బీజేపీ



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా రోడ్లు ఊడుస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

చైతన్యపురి: పర్మినెంట్ చేయాలని సమ్మె బాట పట్టిన జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తాము అండగా ఉంటామని ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్ల బీజేపీ కార్పొరేటర్లు అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా కార్పొరేటర్లు రహదారులను ఊడ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చినా ఇంతవరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయలేదన్నారు. మోసపూరిత మాటలతో సీఎం కాలయాపన చేస్తున్నారన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించేంత వరకు వారికి తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, ఆకుల శ్రీవాణి, పవన్‌కుమార్, కళ్లెం నవజీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి: సీపీఎం



నందనవనంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు , మహిళా సంఘాల ప్రతినిధులు

హస్తినాపురం: బాలికపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య డిమాండ్ చేశారు. అత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలని కోరుతూ బుధవారం హస్తినాపురం డివిజన్ నందనవనం కాలనీలో కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్, ఐద్వా మహిళా సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ, నందనవనం కాలనీలో లైంగిక దాడికి గురైన బాలిక కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేసేంతవరకూ తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. గిరిజన మహిళ లక్ష్మిపై ఎల్‌బీనగర్ పోలీసులు దాడి చేసిన ఘటన మరువకముందే ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అనాథ బాలికపై సామూహిక అత్యాచారం జరిగిందని, ఈ విషయాలపై స్థానిక ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి సీఎం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి బాధితుల కుటుంబానికి పరిహారం ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు మనోహర్, ఎమ్మార్పీఎస్ నాయకులు జీడీ నర్సింహ, ముత్యాలు, గద్ద శీను, మహిళా నాయకులు అరుణ, జయమ్మ, కుమారి, సంధ్య, నాయకులు రవీందర్ యాదయ్య, సుజన్, రాధమ్మ, నర్సమ్మ, లింగమ్మ పాల్గొన్నారు.

'చంద్రయాన్–3' సంబురాలు



వీక్షిస్తున్న శ్రీవిజ్ఞాన వర్ధిణి హైస్కూల్ విద్యార్థులు

మలక్‌పేట: చంద్రయాన్‌3 విజయవంతం కావడంపై మూసారంబాగ్‌లో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. పార్టీ సీనియర్ నేత బొక్క మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యకర్తలు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. త్రివర్ణ పతాకాలు చేతబూని 'జయహో భారత్' అంటూ నినాదాలు చేశారు. పార్టీ నాయకులు గౌర దేవేందర్, యాదగిరి సురేందర్, శశికాంత్, గణేష్, లక్ష్మణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయుందరికీ గర్వకారణం

సైదాబాద్: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడం భారతీయులందరికీ ఎంతో గర్వకారణమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి, శ్రీవిజ్ఞాన వర్ధిని విద్యాసంస్థల కరస్పాండెంట్ వీరేంద్రబాబు యాదవ్ అన్నారు. బుధవారం సైదాబాద్‌లోని పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్‌లపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది చంద్రుడిపై చంద్రయాన్–3 ల్యాండింగ్ దృశ్యాలను వీక్షించారు.

శుభం కన్వెన్షన్‌లో...

నాగోలు: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో బుధవారం నాగోలు శుభం కన్వెన్షన్‌లో నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో బాణసంచా కల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్యే రవికుమార్, బీజేపీ నాయకులు వస్పరి మల్లేష్, బద్దం బాలకృష్ణ గౌడ్, దప్పు రాజు, పిల్లయిపల్లి నర్సింగ్ పాల్గొన్నారు.



మూసారంబాగ్‌లో సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్, కార్పొరేటర్ చింతల అరుణ

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఉమెన్ సేఫ్టీ వింగ్ శిఖా గోయల్

కాచిగూడ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఉమెన్ సేఫ్టీ వింగ్ శిఖా గోయల్ అన్నారు. తెలంగాణ యువతి మండలి, ఎ.శ్యామలాదేవి మహిళా డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా బుధవారం బర్కత్‌పురలోని కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు చక్కగా చదువుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తితే తప్పక విజయం వరిస్తుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ముందుండాలని సూచించారు. ఉన్నత స్థానాల్లో స్థిరపడి దేశ ఖ్యాతిని చాటిచెప్పాలని పేర్కొన్నారు. కాలానుగుణంగా విద్యార్థుల ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని, అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వశక్తితో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల్లో విలువలు ముఖ్యమన్నారు. సమాజానికి ఉపయోగ పడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యాలపై ఉందన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల నుంచి విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ప్రస్తుతం పోటీ ఎక్కువగా ఉందని, దానిని తట్టుకొని నిలబడగలిగే మానసిక దృఢత్వాన్ని ప్రతి విద్యార్థి పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీని అలవర్చుకుంటే జీవితంలో ఉన్నతంగా రాణించగలరని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ యువతి మండలి అధ్యక్షురాలు శేషు విఠల్, ఉపాధ్యక్షురాలు ఆర్.పద్మజ మల్లికార్జున్, కార్యదర్శి నివేదిత కుమార్, కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, ప్రిన్సిపాల్ బి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉప్పల ఫౌండేషన్ చేయూత

నాగోలు: నిరుపేదలకు ఉప్పల ఫౌండేషన్ నిరంతరం చేయూతనందిస్తుందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌కు చెందిన పేద కుటుంబానికి చెందిన వరలక్ష్మి వివాహంకోసం, హైదరాబాద్‌లోని పాతబస్తీకి చెందిన నిరు పేద కుటుంబానికి చెందిన అమ్మాయి భవాని వివాహం కోసం సాయం చేయాలని వారి కుటుంబసభ్యులు బుధవారం శ్రీనివాస్ గుప్తాను నాగోల్‌లో కలిశారు. దీంతో ఆయన ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తె మెట్టెలు, చీర, గాజులు విరాళంగా అందజేశారు. సిద్ధిపేట జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ యువజన అధ్యక్షుడు ఎన్సీ సంతోష్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ ఐవీఎఫ్ అధ్యక్షుడు కైలాస ప్రభాకర్, నాగేంద్రం, వుత్తునూరి సంపత్, మాడిశెట్టి సదానంద్‌గుప్తా, ముహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 27, వంకాయ 28, బెండ 23, పచ్చిమిర్చి 40, కాకర 35, బీర 28, క్యాబేజీ 18, ఫ్రెంచిబీన్స్ 50, క్యారెట్ 40, దొండ 23–35, చిక్కుడు 45, గోకర 23, బీట్‌రూట్ 25, క్యాప్సికం 40, ఆలు 21, దోస 28, సొర 11, పొట్ల 18, ఉల్లి గడ్డ 29, చామగడ్డ 35. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సీనియర్ సిటిజెన్‌ను బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తికి జైలు

చాదర్‌ఘాట్: బైక్‌పై వెళ్తున్న సీనియర్ సిటిజెన్‌ను వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టడమే కాకుండా దుర్భాషలాడిన వ్యక్తికి మూడు రోజులు జైలుశిక్ష విధించిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.బుధవారం సీఐ ప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్‌కే పురానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి నర్సింహ(63) తమ ఇంటి నుంచి బైక్‌పై అబిడ్స్‌కు బయలుదేరాడు. చాదరఘాట్ చౌరస్తాకు రాగానే వనస్థలిపురానికి చెందిన సాయికుమార్‌రెడ్డి(23) వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టి దుర్భాషలాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా మనోరంజని భవనంలోని స్పెషల్ 6వ ఎంఎం మేజిస్ట్రేట్ లక్ష్మణ్‌రావు నిందితుడికి మూడురోజుల జైలుశిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య



మహ్మద్ రషీద్ (ఫైల్)

చంచల్‌గూడ: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం రాత్రి మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చావణీ డివిజన్ బాగే జారాలో నివాసముండే మహ్మద్ రషీద్ (51) గతంలో పాన్ షాపు నిర్వహించేవాడు. 10 ఏళ్ల నుంచి మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. 3 ఏళ్ల నుంచి మంచానికే పరిమితమయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై రషీద్ ఆత్మహత్యక పాల్పడి ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూదందా చేస్తోంది: రాంరెడ్డి



మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంతి వైఎస్ రాజశేఖర రెడ్డి ఎలాంటి రుసుం వసూలు చేయకుండా కర్మన్‌ఘాట్‌లోని పేదల భూములను రెగ్యులరైజ్ చేశారని, అదే విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా పేదల భూములను రెగ్యులరైజ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి కోరారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఎప్పుడూ ఓట్లు, డబ్బుల దండుకోవాలనే ఆలోచన తప్ప.. ప్రజలకు మేలు చేయాలనే సోయ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు తాము కృషి చేస్తామన్నారు. 58,59 జీఓ ద్వారా పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను సైతం ఈ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటోందని, ఇళ్లు కట్టుకోకుండా ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ భూ దందా చేస్తోందని బీఆర్‌ఎస్ సర్కార్‌పై రాంరెడ్డి ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో ఎల్‌బీనగర్ ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పి కాంగ్రెస్‌ను అధిక మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



దుర్గాభవానీనగర్‌లో వరదనీటి కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో ఉన్న మౌలిక సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరించి ఇతర నియోజకవర్గాలకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దటమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం చంపాపేట డివిజన్ పరిధిలోని దుర్గాభవానీనగర్, ఎస్‌వీ కాలనీలో రూ.75 లక్షలతో నిర్మించ తలపెట్టిన వరదనీటి కాలువ, సీసీ రోడ్డు పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. అలాగే, శుభోదయ కాలనీలో రూ.85 లక్షల వ్యయంతో నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘ భవనాన్ని కూడా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...బైరామల్‌గూడలో నిర్మాణ దశలో ఉన్న ఫ్లైఓవర్ అక్టోబర్ నెలలో పూర్తి అవుతుందన్నారు. వరదనీటి ముంపు కాలనీలలో కూడా రెండవ దశ వరదనీటి కాలువల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లా రఘుమారెడ్డి, ముడుపు రాజిరెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, రమాకాంత్, భానుప్రకాష్‌రెడ్డి, నరేష్, చీర తిరుమలేష్, మేక సురేందర్‌రెడ్డి, ప్రభాకర్, అంజిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ నిర్వహణపై వివాదస్పద వ్యాఖ్యలు సరికాదు

వాగామ్రి ఆలయ చైర్మన్ అశోక్



బస్తీ మహిళలతో కలిసి పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ అశోక్

సైదాబాద్: పిట్టల కులస్తుల ఆరాధ్య దైవం సైదాబాద్ పెద్దతోటలోని వాగామ్రి దుర్గామాత ఆలయ నిర్వహణపై కొందరు కావాలని వివాదస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆలయ చైర్మన్ అశోక్ అన్నారు. బుధవారం ఆయన బస్తీ మహిళలతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత 35 ఏళ్లుగా తాము ఇక్కడి అమ్మవారిని ఆరాధిస్తున్నామన్నారు. తమ అందరి కృషితో ఆలయం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు.అయితే ఆలయ అభివృద్ధి గిట్టని కొందరు గొడవలు సృష్టించాలని ఆలయ నిర్వహణపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆలయంలో నిర్వహించే పూజలు, బోనాలు, ఇతర సందర్భాల్లోనూ కమిటీ వారు భక్తుల నుంచి ఎలాంటి రుసుం వసూలు చేయడం లేదన్నారు. ఆలయంలో ఎంతోమంది పేదలకు ఉచితంగా వివాహాలు జరిపించామన్నారు.పలు కబ్జా కేసుల్లో ఉన్నవారు భక్తులను తప్పుదారి పట్టించేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధి దయా కాళి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

నాగోలు: ఆర్యోగంపై అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పాండుగౌడ్, డాక్టర్ అనురాగ్ అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మధురానగర్ కాలనీ అసోసియేషన్ – సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల సంయుక్తంగా కాలనీ కమ్యూనిటీ హాల్ లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపోటు, మధుమేహం తదితర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. మధురానగర్ కాలనీ, శివశంకర్ కాలనీతో పాటు ప్రకృతి నివాస్, శ్రీ సాయి శ్రీనివాస, వాసవి బృందావన్ అపార్ట్‌మెంట్‌వాసులు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్ రావు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ మోహనా చారి, కార్యదర్శి వెంకట్ నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు పాండురంగారావు, ధనరెడ్డి, సూర్య ప్రకాష్, రమేష్, శంకర్ చక్రధర్, యాదగిరి రెడ్డి, జోగు ప్రభాకర్, భాస్కరరావు పాల్గొన్నారు.

మద్యం ఆదాయంపై ఉన్న శ్రద్ధ యువత భవిష్యత్‌పై లేదు

రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ నేత మురళీధర్‌రావు ఆగ్రహం

మన్సూరాబాద్: డ్రగ్స్, గంజాయి, బెల్టుషాపులతో యువత పక్కదారి పట్టి మత్తుతో నేరాలకు పాల్పడుతున్నారని బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు విమర్శించారు. సేవ్ ఎల్‌బీనగర్ పేరుతో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద 48 గంటల నిరహారదీక్షను బుధవారం చేపట్టారు. ఈ దీక్షకు మురళీధర్‌రావు హాజరై మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మద్యంతో వస్తున్న ఆదాయాన్ని చూసి మురిసిపోతూ యువత భవిష్యత్‌ను పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. 24 గంటల మద్యాన్ని బెల్టుషాపుల పేరుతో అందుబాటులో ఉంచి యువత జీవితాన్ని ఆగమాగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగారు తెలంగాణ చేస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని తాగుబోతులు, గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు.

డ్రగ్, గంజాయి రహిత ఎల్‌బీనగర్ కోసమే...

డ్రగ్స్, గంజాయి, బెల్టుషాపుల రహిత ఎల్‌బీనగర్ నియోజకవర్గం కోసమే 48 గంటల దీక్షను చేపట్టామని బీజేపీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. మద్యం మత్తులో ఎల్‌బీనగర్ యువత నేరాలకు పాల్పడి జైలుపాలయ్యారని ఆవేదన చెందారు. మన్సూరాబాద్‌లో బోనాల పండుగ సమయంలో మద్యం కోసం జరిగిన గొడవలో యువకుడు బలైపోయాడని, మీర్‌పేటలో బీర్‌బాటిల్ కోసం జరిగిన గొడవలో మరో యువకుడు మృతి చెందాడని గుర్తుచేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి కబ్జాలపై ఉన్న చిత్తశుద్ధి, ప్రేమ యువత భవిష్యత్‌పై లేదని ఆరోపించారు. కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్సీ రవికుమార్, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, చింతల సురేందర్‌యాదవ్, విజయ్‌కుమార్, నాంపల్లి రామేశ్వర్, కృష్ణంరాజు, రవిశంకర్, గంగదాసు కృషారెడ్డి,కృష్ణవేణి, గీతారెడ్డి, చిల్కూరి మాధవి, మన్నెం అరుణ, సామ ప్రభాకర్‌రెడ్డి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న మురళీధర్‌రావు